# వెంటాడిన పనసపండు

"ఏం వదినమ్మా - ఏం చేస్తున్నావు?" అంటూ లోనికి వచ్చింది కల్యాణి.

"రారా. దారితప్పి వచ్చినట్లున్నావు" అంటూ చిరనవ్వుతో ఆహ్వానించింది రాధ.

"దారేం తప్పలేదులే. డాక్టర్ రమా నర్సింగ్‌హోమ్‌కి వెళ్ళి వస్తున్నాను. దార్లోనేగా మీ ఇల్లు. నిన్ను చూసి చాలా రోజులయింది. అందుకని ఓసారి చూసిపోదామని వచ్చాను."

"ఆస్పత్రి నుంచా! ఏమిటి సంగతి! అందరూ కులాసాయేనా?" - కంగారుగా అడిగింది రాధ.

"మరేం లేదు. వనజ పురుడు పోసుకుంది. మొదటి కాన్పు కదా! ఆస్పత్రిలో చేర్పించారు. అదే మంచిదైందిలే."

"అదేం?"

"సిజేరియన్ ఆపరేషన్ చేసి బిడ్డని తీయాల్సి వచ్చింది."

"పురుడు కష్టమైందన్నమాట?"

"ఆపరేషన్ చేయకుంటే అయ్యేండేదే."

"పోన్లే - ఏం బిడ్డ!"

"మగపిల్లవాడు పుట్టాడు. పనసపండులా ఉన్నాడనుకో"

"ఊఁ.... అంత బాగున్నాడేం .... నేనూ వెళ్ళి చూసొస్తాను."

"అలాగే .... వెళ్ళిరా .... మళ్ళీ ఎప్పుడు డిశ్చార్జి చేస్తారో ఏమో!"

కాసేపు ఆ మాటా యీ మాటా మాట్లాడి వెళ్ళిపోయింది కల్యాణి.

వనజ వాళ్ళిద్దరికీ స్నేహితురాలే. కల్యాణి కంటే రాధ పదేళ్ళు పెద్ద. పైగా నలుగురు బిడ్డల తల్లి. వనజకి ఇరవై యేళ్ళు. పెళ్ళయి ఏడాది పూర్తి కాలేదు. వీళ్ళ ముగ్గురికి వయసులో ఇంత తేడా వున్నా మహిళామండలిలో తరుచు కలుసుకుంటుండే కారణంగా మంచి పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత అభిప్రాయాలు కూడా కలియడంతో మంచి స్నేహం అయింది.

కల్యాణి వెళ్ళిపోయినా రాధ మనసులో వనజని గురించిన ఆలోచనలే మెదులుతున్నాయి. "పనసపండులా ఉన్నాడనుకో" అన్న మాటలు చెవుల్లో రింగుమంటున్నాయి. రాధ మనసు గతంలోకి తొంగిచూసింది.

వాళ్ళ ఊళ్లో పనసకాయలు, పనస పళ్ళు విరివిగా దొరుకుతుండేవి. అప్పుడు ఆమెకి పదేళ్ళుంటాయి.

ఆ రోజు వాళ్ళ తాతగారి తద్దినం.

ఆ క్రితంరోజే వాళ్ళ నాన్నగారు కూర చేయాలనే ఉద్దేశంతో పనసకాయ తెచ్చారు. నిజానికి అది పనస సీజన్ కాదు. అయినా పళ్ళంరాజుగారి తోటలో ఒక కాయ దొరికింది. ఆయనతో వున్న స్నేహం కొద్దీ అడిగి తెచ్చారాయన.

ఆ కాయని చూడగానే రాధావాళ్ళ అమ్మకి ఎంతో సంతోషమయింది.

"పనసకాయ దొరికినప్పుడే తద్దినం పెట్టమని సామెత. అలాంటిది కాలం కాపోయినా సరిగ్గా సమయానికి పనసకాయ తెచ్చారు" అంటూ ఎంతో సంబరపడిపోయింది.

పనసకాయలో వున్న ఆ విలువేమిటో రాధ చిన్నబుర్రకు అర్థం కాలేదు.

తద్దినం రోజు పొద్దున్నే వాళ్ళ అమ్మ రాధని పిలిచి పనసకాయ తెమ్మంది. అంత బరువైన పనసకాయను ఎత్తలేక ఎత్తి వంటింట్లోకి తెస్తూ కాలిమీద వేసుకుంది. ఆ దెబ్బకి కెవ్వున కేకవేసింది.

"ఏం జరిగిందే?" అంటూ పరుగున వచ్చింది అమ్మ

వెనకాలే నాన్నగారు కూడా వచ్చారు.కాయ కాలిమీద పడడంతో బాధతో విలవిల లాడుతూ ఏడవ సాగింది రాధ. అసలే బరువైన కాయేమో, ఆపైన ముళ్ళు ముళ్ళుగా ఉంటుందేమో కాలికి బాగా గాయమై రక్తం కారసాగింది.

"ముప్పొద్దులూ తింటున్నా ఒంట్లో ఓపికుండదు చవట దద్దమ్మకి. కాయకూడా ఎత్తలేదు' ' అంటూ రాధని ఓ మొట్టికాయ వేసింది వాళ్ళమ్మ.

రాధ ఏడుపుస్థాయి హెచ్చింది.

"అసలే అది దెబ్బతగిలి ఏడుస్తుంటే దాన్ని ఇంకా కొడ్తావెందుకూ?" అని భార్యను కసురుకొని కూతుర్ని దగ్గరకు తీసుకున్నాడు నాన్నగారు.

అమ్మ లోపలికి వెళ్ళి చెంబుతో నీళ్ళూ, పసుపూ, గుడ్డపీలికా తెచ్చింది. కాలుకడిగి పసుపు అద్ది గుడ్డతో కట్టు కట్టింది.

అప్పటికా ఘట్టం ముగిసింది.

కొంచెం సేపట్లోనే రాధ దెబ్బ సంగతి మరిచిపోయి ఎప్పటిలాగా గంతులు వేస్తూ ఆడుకోసాగింది.

తద్దినానికి కావలసిన సరుకులన్నిటినీ ముందే తెచ్చారు నాన్నగారు. ఆ క్రిందటి రాత్రే అమ్మ మిగిలిన కూరలన్నిటినీ తిరిగి సిద్ధం చేసుకుంది. ఇక పనసకాయ ఒక్కటే తరువాయి.

అప్పటికి ఎనిమిది గంటలు దాటింది. మామూలుగా అయితే అప్పటికి నాన్నగారి స్నానం, సంధ్యా అన్నీ అయిపోయేవి. అయితే ఆరోజు తద్దినం కావడంతో బ్రాహ్మణుడు వస్తేనే కాని మడిస్నానం పడదు. అందువల్ల ఆయన పనసకాయను పొట్టుగా కొట్టడానికి ముందేసుకున్నాడు. అమ్మ పనసకాయకి పెచ్చులు తీసి ఇచ్చింది. ఆయన పీటని తిరగేసి దానమీద పనసకాయని నిలబెట్టి అది పడిపోకుండా స్క్రూడ్రైవర్ గుచ్చి పట్టుకొని కత్తితో ముక్కలుగా కొట్టడం మొదలుపెట్టాడు. చిన్న ముక్కల్ని పేర్చి మరీ చిన్నగా రంపం పొట్టల్లే కొట్టసాగాడు. ఆ కొట్టిన పొట్టుని ప్రక్కన పళ్ళెంలో పోసి దానికి కనరు రాకుండా పసుపూ, నూనె కలవసాగాడు.

ఇంతలో వీధిలోకి ఎవరో వచ్చి పిలిస్తే మాట్లాడడానికి వెళ్ళాడు ఆయన. అమ్మ కరివేపాకు కోసుకురావడానికి దొడ్లోకి వెళ్ళింది. రాధ ఉన్నది ఊరుకోకుండా నాన్నగారు కొట్టిన విధంగానే పనసకాయని కొట్టడం మొదలు పెట్టింది.

రాధకి సరదా ఉందేకాని ఆలోచన, అనుభవం లేవు. నాలుగు దెబ్బలు వేసిందో లేదో, బలంగా

ఎడమచేతిమీద కత్తితో కొట్టుకుంది. ఆ దెబ్బకి కెవ్వున కేకవేసి కళ్ళు బైర్లుకమ్మి పడిపోయింది.

"ఏమైందే?" అంటూ అమ్మా నాన్న ఒకేసారి పరుగెత్తుకు వచ్చారు. రాధ ఎడమచేయి చూపుడువేలు గోరుదగ్గర సగం వరకు తెగిపోయింది. చిమ్మన గ్రోవినుంచి కొట్టినట్లు ధారగా కార్తోంది రక్తం.

"అయ్యో ..... అయ్యో ...." అంటూ గుడ్డని తడిపి గాయానికి చుట్టి నొక్కిపట్టారు నాన్నగారు.

"అయ్యో ..... అయ్యో ..... ఇదేమి ఖర్మమే." అంట అమ్మ శోకాలు పెట్టసాగింది.

ఈ గోలకి ఆ వచ్చినాయనా కంగారుగా లోనికి వచ్చాడు. సంగతి చూసి "ఉండండి. రిక్షా తెస్తాను. ఆస్పత్రికి తీసుకువెళ్దాం" అంటూ ఉరుక్కున వెళ్ళాడు.

రాధని ఆస్పత్రికి తీసుకువెళ్ళి కట్టు కట్టించి, ఇంజక్షన్ తెప్పించి, ఇంటికి తిరిగి వచ్చేసరికి 12 గంటలు అయింది. అప్పటికి బ్రాహ్మణుడు వచ్చేశాడు. మనసు మనసులో లేని అమ్మ ఏదో విధంగా వంట అయిందనిపించింది. ఇంత అనర్థానికి కారణమైన పనసకాయ కూర చేయడం పడనేలేదు. ఏదో కొంచెంగా శాస్త్రానికి చేసి బ్రాహ్మణుడికి మాత్రం వడ్డించారు. ఎలాగో ఆ రోజుకి తద్దినం అయిందనిపించారు ఆ దంపతులు.

ఆరోజంతా అమ్మ "ప్రొద్దునే ఎవరి మొహం చూశావే తల్లీ. ఇన్ని దెబ్బలు తిన్నావు" అంటూ పదే పదే కంటనీరు పెట్టుకోసాగింది.

ఆ పనసకాయ కూరని మర్నాడు చేశారు. మామూలుగా అయితే రాధకి కూడా ఆ కూరంటే ఎంతో ఇష్టం. కాని ఆ కాయ మూలంగా తనకి రెండు దెబ్బలు తగలడంతో అదంటే ఒకవిధమైన భయం లోపల గూడుకట్టుకుంది.

కూరని అన్నంలో కలిపింది. అలా కలుపుతోంటే కూరపోపులో వేసిన ఎండు మిరపకాయ ఎర్రగా కనిపించింది. దాన్ని చూస్తుంటే తన వ్రేలినుంచి పనసపొట్టులో పడిన రక్తం కళ్ళముందు మెదిలింది. నిజానికి ఆ పొట్టునంతా అమ్మ బయట పారేసింది. మంచి ముక్కల్ని కొట్టే కూర చేసింది. అయినా ఆ దృశ్యం జ్ఞాపకానికి రావడంతో, ఒక్క ముద్ద నోట్లో పెట్టుకోగానే బొళ్ళున వాంతి వచ్చేసింది. ఇంక అన్నం తినలేక లేచి వెళ్ళిపోయింది.

"ఇదేం ఖర్మమే" అంటూ అమ్మ రాధని మంచం మీద పడుకోబెట్టి. ఆ వదిలేసిన అన్నం దిష్టితీసి అవతల పారేసింది.

రాధ వేలికి అయిన గాయం ఒక విధంగా మానడానికి పదిహేను రోజులు పట్టింది. కత్తివేటుకి వ్రేలిముక్క ఎగిరి పోవడంతో గాయం అతుకున్నా వికారంగానే తయారయింది. ఆ అవలక్షణం ఆమె పెళ్ళి విషయంలో చాలాకాలం అవరోధంగా తయారయింది కూడా.

ఆ తర్వాత జరిగిన మరో సంఘటన రాధ మనసుపై మాయని ముద్ర వేసింది. రాధ పెళ్ళయి అత్తవారింటికి వెళుతోంది. రైలు ప్రయాణం - పెట్టె జనంతో క్రిక్కిరిసి ఉంది. అంతటి జనంలోకి ఒక వ్యక్తి మరోవ్యక్తి ఆసరాతో లోపలికి చొచ్చుకు వచ్చాడు. మొదటి వ్యక్తి చలిజ్వరం వచ్చిన వాడిలాగా ఎగపకు తున్నాడు. దానికితోడు ముఖం అంతా గడ్డలు, కూర్చున్న వాళ్ళ కాళ్ళ మధ్యకు తోసుకువచ్చి నేలమీద పడుకున్నాడు మధ్యమధ్య మూలుగుతూ.

పైన సామాను పెట్టేచోట ఎవరో ఓ మాదిరి పనసపండుని ఉంచారు. దానిని చూడగానే ఒక్కసారి గెండె గతుక్కుమంది రాధకి! 'ఏమిటి పనసపండు నన్నిలా వెంటాడుతోంది?' అనుకుంది.

రైలు వేగంగా వెళుతోంది. కొంతసేపటికి ఏమైందో తెలీదుకాని రైలుకి ఉన్నట్లుండి విపరీతమైన

కుదుపువచ్చి పైనున్న పనసపండు కాస్తా ధన్‌మని కిందకి పడింది. ఆ పడడం కూచున్నవాళ్ళను రాసుకుంటూ వెళ్ళి ఆ క్రింద పడుకున్న వ్యక్తి ముఖం మీద పడింది.

"చచ్చాన్రో" అని అరిచాడు ఆ మనిషి.

వెంటనే పక్కనున్నవాళ్ళు అతన్ని పైకి లేవదీశారు.

అసలే కురుపుల ముఖం కందగడ్డల్లే అయింది. ఒకటే నెత్తురు కారడం. వెంటనే అతని వెంటవచ్చిన వ్యక్తి పైబట్ట తీసి అతని ముఖంపై గాయాన్ని అదిమిపట్టాడు. ఆ పనసపండు ఎవరిదనే చర్చ. ఆ వ్యక్తిపట్ల సానుభూతి వాక్యాలతో పెట్టె ప్రతిధ్వనించింది. మరెవరో గొలుసు లాగి రైలు ఆపారు. రైలు ఆగాక గార్డుకి సంగతి చెప్పారు. ఆయన ఆ క్షతగాత్రుడిని తన కంపార్టుమెంటు లోకి మార్పించి ప్రథమ చికిత్స చేశాడు.

ఆ భయానక దృశ్యం చూసి రాధ చలించిపోయింది. ఆమె బేల మనసు బెదిరిపోయింది. ఈ సంఘటనతో ఆమె పనస అంటే పామో, పులో అన్నంతగా భయపడసాగింది.

రాధ ఆలోచనలు ఇంకా ముందుకి సాగాయి.

పెళ్ళయిన నాలుగు నెలలకే ఆమె గర్భవతి అయింది. ఇరుగుపొరుగు వొచ్చి "నీకేమమ్మా .... దబ్బపండులా ఉన్నావు. పనసపండు వంటి పిల్లాడిని కంటావు" అంటుండేవారు. ఆ మాట వింటేనే ఆమె ఒళ్ళు జలదరించేది. వెన్నుపూసలోంచి కరెంట్ పాసయ్యేది. ఆ మాట అనవద్దని వాళ్ళతో ఎలా చెప్పడం. వాళ్ళ సంగతి సరే. అత్తగారు కూడా నిత్యమూ చెవి నిల్లుకట్టుకుని జపం చేస్తుండేది. "ఒసేయ్ - కోడలు పిల్లా .... మీ ఆయనకి పనసపండంటే ప్రాణం. నువ్వు పనసతొనల్లాగా మిల మిల మెరిసే పనసపండంటి పిల్లాణ్ణి కనాలే" అంటుండేది. ఎటూ చెప్పలేక ఏమీ అనలేక లోలోపలే మధనపడి పోయేది రాధ. ఆమెకి కలల్లో కూడా పనసపళ్ళే ప్రత్యక్షం అయ్యేవి. అది పచ్చగా బంగారంలా కాకుండా, నల్లగా పొడవాటి ముళ్లతో తనని పొడవబోతున్నాట్లు కలలు వస్తుండేవి. నిద్రలోనే భయంగా అరిచి లేచి కూర్చుండేది. ఏం కల వచ్చిందని అడిగితే ఏమీ చెప్పలేకపోయేది. ఏమని చెప్పగలదు? కలలో పనసపండుని చూసి భయపడ్డానని చెప్తే విన్నవాళ్ళు నవ్విపోతారు. విష్ణుశబ్దం వినిపించకూడదనుకొన్న ఘంటాసురుడు చెవులో గంటలు కట్టుకున్నా ఎక్కడి నుంచైనా విష్ణు నామం వస్తోందా అన్న అనుమానంతో, పరోక్షంగా నిత్యమూ విష్ణునే మనసులో తలచుకుంటుండేవాడు. అలా అయింది రాధ పని. ఎంతగా పనసను గురించిన ఆలోచనలను మానాలని ప్రయత్నం చేస్తే అంతకు ఎక్కువగా అవి రాసాగాయి.

రాధకి పురుడు వచ్చింది. అందరూ కోరుకున్నట్లు పనసపండంటి పిల్లవాడే పుట్టాడు. ఎటువంటి పిల్లవాడు పుడ్తాడోనని భయపడిన రాధ వాడిని చూసి ఎంతో ముచ్చట పడింది. తేలికపడ్డ మనసుతో హాయిగా ఊపిరి పీల్చుకుంది.

అయితే పనసపండు నీడ రాధని వెంటాడుతూనే వచ్చింది. ఆమె బిడ్డని చూసిన ప్రతివాళ్ళూ..... "అబ్బ! పనస పండంటి పిల్లవాడు" అని మురిసిపోసాగారు. ఆ దిష్టే తగిలిందో ఏమో ఆ పిల్లవాడికి మూడురోజులు తీవ్రమైన విరేచనాలు పట్టుకున్నాయి. వైద్య సహాయానికికాని, మరి దేనికి కాని లోటులేదు. అయినా నాలుగో రోజున ఆ పసివాడు పనసపండులాంటి వాడు ఈత గింజలా అయిపోయాడు. ఆ సాయంత్రానికి కన్నుమూశాడు. ఈ సంఘటన ఆమె మనసుని తీవ్రంగా గాయపరచింది. అయితే కాలం మాన్పలేని గాయం అంటూ ఉండదు. రాధ విషయంలోనూ అంతే అయింది. ఆ తర్వాత ఆమె నలుగురు బిడ్డల తల్లి అయింది. రాధ ఆలోచనలు ఒక కొలిక్కి

వచ్చాయి. ఆ ఆలోచనలు అలా అలా సాగి పెద్ద కూతురు గిరిజ మీద వాలాయి.

గిరిజ ఇప్పుడు మొదటిసారిగా గర్భవతి అయింది. ఏడో నెలలో తొలికాన్పు కోసం తీసుకువచ్చింది. ఎప్పటికప్పుడు డాక్టరుకి చూపిస్తూ కంటికి రెప్పలా చూసుకుంటోంది. ఇంటికి వచ్చినవాళ్ళు మామూలుగా 'పనసపండులాంటి పిల్లాడు పుట్టాలి' అంటుండేవాళ్ళు. ఆ మాట వినగానే చెప్పలేని భయంతో ఆమె మనసులోనే విలవిల్లాడేది. ముఖం పాలిపోయేది. తల్లి మనోగతం తెలియని గిరిజ మాత్రం అదేమీ గమనించకుండా, ఆ మాటలు విని ముసిముసి నవ్వులు నవ్వుకుంటుండేది. సిగ్గుతో ఆమె బుగ్గలు ఎరుపెక్కు తుండేవి.

ఆరోజు గిరిజను పరీక్ష చేసిన డాక్టరు రెండు రోజుల్లో పురుడు వస్తుందనీ, సుఖప్రసవమవుతుందనీ చెప్పింది. అయినా కూడా ముందు జాగ్రత్తగా వెంటనే ఆస్పత్రిలో జేర్పించమని భర్తని కోరింది. మర్నాడే ఆస్పత్రిలో జేర్పిస్తానని చెప్పాడాయన.

మర్నాడే గిరిజను ఆస్పత్రిలో జేర్పించింది. సమయం దగ్గర పడుతొన్న కొద్దీ రాధని పనసపండు వెంటాడడం మరింత ఎక్కువయింది. ఆ సంఘర్షణను తట్టుకోలేకపోయింది ఆమె. చిన్నప్పుడు తాను పనసకాయ కూర తింటూ వాంతి చేసుకొన్నప్పుడు, అమ్మ అదే అన్నం తీసుకువచ్చి దిష్టి తీసి పారేయడం గుర్తుకి వచ్చింది. వెంటనే ఆమె మనసులో ఒక ఆలోచన మెరిసింది. వెంటనే భర్తను బజారు పంపించి పనసపండు తెప్పించింది. అదృష్టవశాత్తూ అది పనసపళ్ళ సీజన్ కావడంతో పండు తేలిగ్గా దొరికింది. గిరిజ ఇంట్లోనుంచి బయలుదేరే సమయానికి ఆ పనసపండుని ఆమె చుట్టూ తిప్పి, దిష్టితీసి కసితీరా నేలకేసి కొట్టింది. అసలే మగ్గిన పండేమో భళ్ళున పగిలింది.

"ఇదేమిటే! ఎవరైనా కొబ్బరికాయతో దిష్టి తీస్తారు. ఉప్పుతో తీస్తారు. అంతేకాని మనసపండుతో దిష్టితీయడం ఎక్కడా చూడలేదు" అంది అత్తగారు. భర్త రాధవంక వింతగా చూస్తూ ఉండిపోయాడు.

"ఇది అంతే. స్వాములవారు చెప్పారు." అని అప్పటికి తప్పించుకుంది రాధ. ఆ మర్నాడు గిరిజ ఆస్పత్రిలో మగబిడ్డడ్ని ప్రసవించింది. అయితే పనసపండువంటి బొద్దుగా వుండే పిల్లాడ్ని కాదు, మామిడిపండు వంటి నాజూకైన పిల్లవాణ్ణి. వాణ్ణి చూసినవాళ్ళు 'బంగారు బొమ్మలాంటి పిల్లాడనో, పండంటి పిల్లాడనో' అనసాగారు. కాని పనసపండు పేరే ఎవరూ ఎత్తులేదు. రాధ మనసు ఎంతో తేలిక పడింది.

మూడోరోజు గిరిజను ఆస్పత్రినుంచి డిశ్చార్జి చేశారు.

సుఖంగా ఇంటికి చేరుకున్న కూతుర్నీ మనవడినీచూసి తృప్తిగా నిట్టూర్చింది రాధ. దిష్టి తీసిన పనసపండుతో పీడంతా కొట్టుకుపోయిందని మనసులోనే సంతోషించింది.

కూతురు ఇంట్లో అడుగు పెడ్తూండగా "ఏం .... మీ అమ్మాయికి పనసపండుతో దిష్టి తీయవూ?" అన్నాడు రాధ భర్త వ్యంగ్యంగా.

"అవసరం లేదు లెండి. అయినా పనసపండు సంగతి మీకేం తెలుసు?" అంటూ మనవడిని చేతుల్లోకి తీసుకొంది రాధ.

*(యువ, జూలై 1988)*